# అదుపు తప్పి బొగ్గు లోడ్ లారీ బోల్తా

- ఐస్ క్రీం బంక్, గాలి మిషన్ దుకాణం ధ్వంసం
- మద్యం సేవించి వాహనం నడిపిన డ్రైవర్
- కేసు నమోదు చేసిన పోలీసులు

నిడమనూరు, డిసెంబర్ 8 : అదుపు తప్పి బొగ్గు లోడ్ లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని నేరెళ్లగూడ మేజర్ వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్ల వారు జామున సుమారు 3 గంటల సమయంలో మిర్యాలగూడ నుంచి హాలియా వైపునకు వస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ నేరెళ్ల గూడ మేజర్ కాల్వ వద్ద కు రాగానే అదుపు తప్పి కుడి వైపునకు పల్టీ కొట్టింది. ఈ క్రమంలో రోడ్డు వెంట ఉన్న ఐస్ క్రీం బంక్ మీదుగా దూసుకెళ్లింది. ఐస్ క్రీం బంక్‌తో పాటు పక్కనే ఉన్న గాలి మిషన్ దుకాణం ధ్వంసమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. పల్టీ కొట్టిన లారీ క్యాబిన్‌లో డ్రైవర్ దిడ్ల యోహాను, క్లీనర్ ఇరుక్కు పోయారు. లారీ అద్దాలు పగులగొట్టుకుని వారు బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గోపాల్‌రావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్ అతిగా మద్యం సేవించి వాహనం నడపటంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు డ్రైవర్ యోహానుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


నేరెళ్లగూడ మేజర్ సమీపంలో బోల్తా పడిన లారీ

## విద్యార్థులకు నోటు బుక్కులు, పెన్నులు అందజేత

త్రిపురారం, డిసెంబర్ 8: మండలంలోని రూప్ల తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డాక్టర్ ఆనంద్, హరిప్రియ నోటు బుక్కులు, పెన్నులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తమ సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత, హెచ్‌ఎం అశోక్, చినగోపాల్, అంజన, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోటు బుక్కులు అందజేస్తున్న డాక్టర్ ఆనంద్, హరిప్రియ

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- డాక్టర్ చందులాల్‌నాయక్

చందంపేట, డిసెంబర్ 8: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి చందులాల్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని పీహెచ్‌సీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఆరోగ్య విషయంలో సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేసుకునేలా, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు.

## తపాలా ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేయాలి

మునగాల, డిసెంబరు 8: ఈనెల 12నుంచి చేపట్టనున్న తపాలా ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం సూర్యాపేట డివిజన్ కన్వీనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం మునగాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తపాలా ఉద్యోగులకు 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాల మంజూరు చేయాలని అన్నారు. టార్గెట్ మేళా వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణరెడ్డి, బ్రహ్మచారి, యాకన్నా సునీల్, సందీప్, నరేష్, దివ్య, స్వాతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తపాలా ఉద్యోగుల సంఘం సూర్యాపేట డివిజన్ కన్వీనర్ నాగరాజు


హాలియాలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి

# సాఫీగా ప్రయాణం

- కోదాడ-జడ్చర్ల 214 కిలోమీటర్ల రోడ్డు పనులు పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

హాలియా, డిసెంబర్ 8: కోదాడ-జడ్చర్ల హైవేతో ప్రయాణం సాఫీగా సాగుతుంది. ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా పూర్తయ్యాయి. 2014 సంవత్సరానికి ముందు గుంతల మయంగా ఉన్న కోదాడ - జడ్చర్ల 214 కిలోమీటర్ల మేర రహదారిని జాతీయ రహదారిగా గుర్తించడంతో పాటు తొమ్మిదేండ్లలోనే పూర్తిచేసి అందంగా రూపొందించారు. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ఈ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు అందమైన ఈ రహదారిని చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### రూ.1200 కోట్లు విడుదల

మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపి కోదాడ - జడ్చర్ల రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా పూర్తయ్యేలా చేశారు. గతంలో ఆర్అండ్‌బీ రోడ్డుగా ఉన్న ఈ హైవేగా గుర్తించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. స్పందించిన కేంద్రం కోదాడ -జడ్చర్ల రహదారిని 167 జాతీయ రహదారిగా గుర్తించి 214కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.1200 కోట్లను విడుదల చేసింది. ఈ రోడ్డు విస్తరణ, వంతెనలు, కల్వర్టులు, ఫైఓవర్ల నిర్మాణం పూర్తికావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 5 ప్యాకేజీలుగా పనులు

కోదాడ – జడ్చర్ల రోడ్డు నిర్మాణ పనులు చకచకా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఐదు ప్యాకెజీలుగా విభజించింది. జడ్చర్ల నుంచి కల్వకుర్తి వరకు మొదటి ప్యాకేజీ, కల్వకుర్తి నుంచి మల్లేపల్లి వరకు రెండో ప్యా కేజీ, మల్లేపల్లి నుంచి హాలియా (అలీనగర్) మూడో, అలీనగర్ నుంచి మిర్యాలగూడెం వరకు 4వ , మిర్యాలగూడెం నుంచి కోదాడ వరకు ఐదో ప్యాకేజీగా విభజించి పనులు పూర్తి చేశారు.

### నాలుగు లైన్ల రహదారులు

కోదాడ – జడ్చర్ల రహదారిలో గ్రామాలు, పట్టణాలు ఉన్న చోట ఆయా గ్రామాల్లో నాలుగు లైన్ల రోడ్డును నిర్మించారు. డివైడర్లను ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుకిరువైపుల డ్రైయినేజీను నిర్మించారు. రోడ్డు మధ్యలో బట్టర్‌ప్లై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణ, డ్రైయినేజీ కాల్వల నిర్మాణంతో గ్రామాలు కొత్తశోభను సంతరించుకున్నాయి.

### రోడ్డు విశాలంగా మారింది



కోదాడ జడ్చర్ల రోడ్డు నాటికి నేటికి ఎంతో తేడా ఉంది. రోడ్డు విస్తరణ పనులతో ఇప్పుడు రోడ్డు విశాలంగా మారింది. ఎక్కడా గుంతలు లేకపోవడంతో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులేవు. ఈ జాతీయ రహదారిపై ప్రయాణం హాయిగా, సాఫీగా సాగుతుంది.

- డాక్టర్ రాఘవేంద్ర జలపాటి, వాహనదారుడు, హాలియా

## ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం మంజూరు చేయాలి

- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ

దేవరకొండ, డిసెంబర్ 8: ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం 10.72 శాతం ఒకే విడతలో మంజూరు చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఆర్ 5శాతం నుంచి 20 శాతానికి పెంచాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు హెల్త్ కార్డులపై అన్ని రకాల వ్యాధులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కరువు భత్యం ప్రతి ఆరు నెలలకో మారు విధిగా మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు మంజూరు చేయాలని ఆయన కోరారు. పంగునూరి లింగయ్య, దామోదర్‌రెడ్డి, ఐజాక్, శాంతికుమారి, యూసుఫ్, కార్యవర్గ సభ్యులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ

## రేపు సర్వ బ్రాహ్మణ సమాజ కార్తీక సమారాధన

కోదాడటౌన్, డిసెంబర్ 8: కోదాడ పట్టణంలోని బ్రాహ్మణ భవన్‌లో ఆదివారం సర్వ బ్రాహ్మణ సమాజ కార్తీక సమారాధాన నిర్వహిస్తున్నట్లు సర్వ బ్రాహ్మణ సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, సాధు సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా సర్వబ్రాహ్మణులందరూ ఇదే ఆహ్వానంగా భావించి పాల్గొనాలని వారు కోరారు.

## 1.75 లక్షల మొక్కలను పెంచడమే లక్ష్యం

నేరేడుచర్ల, డిసెంబర్ 8: 9వ విడత హరిత హారం కార్యక్రమంలో 1.75లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యమని ఏపీఓ శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపట్టిన హరితహారం కార్యక్రమానికి కావాల్సిన మొక్కలను పెంచడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

## శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి,డిసెంబర్ 8: మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ మండపంలో కల్యాణం జరిపారు. అనంతరం ఆలయ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. ఆలయ ధర్మకర్త విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


లక్ష్మీనరసింహుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

### అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, భజనలు, పడిపూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులతో పాటు వెంకటరెడ్డి, కొండలు తదితరులు పాల్గొన్నారు.